క్లుప్తంగా

పార్టీ గెలుపునకు కృషి చేద్దాం



ఎమ్మెల్యే బాలరాజును సన్మానిస్తున్న పరిశీలకులు

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన విజ్జు వెంకటేశ్వరరావు శుక్రవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును బుట్టాయగూడెంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువాను కప్పి సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో శ్రేణులు సమన్వయంతో పార్టీ గెలుపుకు సమష్టిగా కృషి చేద్దామని బాలరాజు సూచించారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీపీ

పోలవరం రూరల్ : పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేటలో శుక్రవారం తెల్లవారు జామున చిక్కాల వీర్రాజుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలోని సామగ్రితో పాటు రూ.75 వేల కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ వెంకటరెడ్డి రూ.5 వేలు సాయం వీర్రాజుకు అందజేశారు. అలాగే 30 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార తహసీల్దార్ బి.సుమతి పంపిణీ చేశారు.

నేడు కట్టుపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం: మండలంలోని సీతప్పగూడెం సచివాలయం పరిధిలోని కట్టుపల్లి, కొల్లాయిగూడెం, బుద్దులవారిగూడెం గ్రామంలో శనివారం 177వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను ఆయన కోరారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌గా రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

కొయ్యలగూడెం : పోలవరం ఏఎంసీ వైస్ చైర్మన్‌గా తాడిగడప రామకృష్ణను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నియమించారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు అన్నారు. అంకాలగూడెంలో శుక్రవారం పార్టీ శ్రేణులతో రామకృష్ణను కలిసి అభినందించారు. ఏఎంసీ అభివృద్ధితో పాటు పుంత రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెడతానని రామకృష్ణ తెలిపారు. పశుసంత నిర్వహణకు ఏఎంసీ ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకువస్తానని చెప్పారు. ఎంపీపీ గంజిమాల రామారావు, సచివాలయ మండల కోఆర్డినేటర్ నూకల రాము, మాజీ ఎంపీపీ మట్టా సత్తి పండు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, ఎంపీటీసీలు జాన్ డేవిడ్ కింగ్, గంటా శ్రీను, ఎస్కే బాజీ, పార్టీ నాయకులు ఏలేటి చంద్రం, మోపిదేవి వాసు, పూలపల్లి రవి, కండెల్లి శివ, కిషోర్, గంటా చినశీను పాల్గొన్నారు.

వలలో చిక్కిన 20 కేజీల మోసు



వలకు చిక్కిన 20 కేజీల మోసు చేప

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం లక్ష్మీపురం సమీపంలోని కొవ్వాడ ప్రాజెక్టులో శుక్రవారం గిరిజన మత్స్యకారుడు వడిసెల రాంబాబు వలలో సుమారు 20 కేజీల మోసు చేప చిక్కింది. దీంతో రాంబాబు ఆనందం వ్యక్తం చేశాడు. ఈ చేపను సుమారు రూ.3000కు కొనుగోలు చేసినట్టు కపిలవాయి హరిసూర్యనారాయణ తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంతో అవకాశాలు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఛత్రపతి శివాజీ డిగ్రీ కళాశాలలో హార్టికల్చర్, వృక్షశాస్త్రం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించగా, మార్చి-2023 బెస్ట్ ఉమెన్ ఎంటర్‌ప్రిన్యూర్ అవార్డు గ్రహీత డి.నాగజ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై కళాశాల విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకం, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకంతో స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి కోరారు.

గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి కృషి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెంలో పోషణ ప్లస్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సుమారు రూ.1150 విలువైన 10 రకాల సరుకుల కిట్‌ను పంపిణీ చేస్తారని చెప్పారు. బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బుట్టాయగూడెంలో 337 మంది గర్భిణులు, 327 మంది బాలింతలకు కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జీలుగుమిల్లి మండలాల పరిధిలో 180 గర్భిణులు, 168 మంది బాలింతలకు వారి ఇంటికే పోషకాహార కిట్లను పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ కిట్లను వినియోగించుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ తెల్లం రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, తెల్లం చిన్నారావు, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ ఈ. తులసి, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

రాజవరం గ్రామంలో..

కొయ్యలగూడెం : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రాజవరం గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందజేశారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మిలు మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డకు అమృత తుల్యమని, ముర్రుపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీను రాజు కోరారు. మండలంలోని ఏపుగుంట గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీదేవి పెదబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ టి.రామ్మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: ప్రతి తల్లీ బిడ్డకు అందించే మొదటి పౌష్టికాహారం ముర్రుపాలేనని సీడీపీఓ వెంకాయమ్మ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, సర్పంచ్ రావు మీనాల చేతుల మీదుగా ప్రారంభించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గూటాలలో..

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ సామగ్రిని గర్భిణులు, బాలింతలకు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాణి, ఈ.మాధవి పాల్గొన్నారు.

యర్రగుంటపల్లి గ్రామంలో..

చింతలపూడి: మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ఎంపీపీ బి.రాంబాబు నాయక్ అన్నారు. చింతలపూడి మండలం యర్రగుంటపల్లి గ్రామంలో పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ఎస్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేగవరంలో..

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో టేక్ హోమ్ రేషన్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బాలింతలు, గర్భిణులకు ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, స్త్రీ శిశు సంక్షేమ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపీటీసీలు పోతన శ్రీను, కుక్కల సత్తిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు నులకాని వీరాస్వామి నాయుడు, జెట్టి దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

కె.కోట మండలంలో..

కామవరపుకోట: మండలంలోని కొత్తూరు, కొండగూడెం, నులాకనివారిగుడెం గ్రామాలలో కామవరపుకోట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంగాదేవి ఆధ్వర్యంలో పోషకాహారల కిట్టలను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. సర్పంచ్ కరిపోతూ అనూష, ఉపసర్పంచ్ మేడూరు రంగబాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ డైరెక్టర్ పండు జగదీష్, ఎంపీటీసీలు మేడంకి పద్మ, పోలిమెట్ల ప్రశాంత్, ఎస్కే కరిముల్లా, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో గిరిజన మహిళ ప్రసవం



బిడ్డను చూపిస్తున్న 108 వాహన పైలట్

బుట్టాయగూడెం : పురిటి నొప్పులతో బాధపడుతున్న గిరిజన మహిళను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. బుట్టాయగూడెం మండలం పడమర రేగులకుంట గ్రామానికి చెందిన గర్భిణీ కుంజా సావిత్రికి శుక్రవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో ఆమెను కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు సావిత్రిని జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ క్రమంలో ఆమెను 108లో తీసుకువెళ్తుండగా కృష్ణాపురం సమీపంలోనే డెలివరీ అయ్యి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇదిలా ఉండగా పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరిన సావిత్రికి కనీస వైద్య పరీక్షలు కూడా చేయకుండానే జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి రిఫర్ చేశారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తగరం బాబూరావు, పౌరహక్కుల సంఘం నాయకులు బి.శ్యామ్‌బాబు బుట్టాయగూడెం ఆరోగ్య కేంద్రం సిబ్బంది తీరును తీవ్రంగా ఖండించారు.

దివ్యాంగుల సాధికారతకు సీఎం కృషి



దివ్యాంగులకు ట్రై మోటార్‌సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా, ముంతాజ్ పఠాన్

జంగారెడ్డిగూడెం: మహిళలతో పాటు దివ్యాంగుల సాధికారతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర దివ్యాంగుల, సీనియర్ సిటిజన్స్ సహాయక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. ఎమ్మెల్యే స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లను ఎలీజా, పఠాన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ముఖ్యంగా ఇంటర్ ఆపై చదుకునే విద్యార్థులు, నిరుద్యోగుల కోసం ట్రై మోటార్ సైకిల్ అందించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1750 మోటార్‌సైకిళ్లను నియోజకవర్గాల వారీగా కేటాయించగా, చింతలపూడి నియోజకవర్గానికి 10 మోటార్ సైకిళ్ల కేటాయించారని, వీటిని అర్హులకు అందజేశామని తెలిపారు. దివ్యాంగులకు ఒక కార్పొరేషన్ పెట్టి, మహిళను చైర్‌పర్సన్‌గా నియమించి వారిని గౌరవించారని వివరించారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలనే సీఎం ధృడసంకల్పంతోనే ఇటువంటి నూతన పథకాలు పుట్టుకొస్తున్నట్టు చెప్పారు. చింతలపూడి నియోజకవర్గంలోని జనాభా దృష్ట్యా కనీసం 50 ట్రై మోటార్ సైకిళ్లు అందించాలని ఎమ్మెల్యే ఎలీజా కోరగా, దీనికి చైర్‌పర్సన్ ముంతాజ్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, వామిశెట్టి హరిబాబు, సీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, జిల్లా యూత్ ప్రెసిడెంట్ పడమటి గిరిబాబు గౌడ్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పండు జగదీష్, బత్తిన చిన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబా, కౌన్సిలర్‌లు ఉగ్గం ప్రసాద్, నేకూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజా సమస్యలు స్వయంగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష రాష్ట్రంలోనే సరికొత్త చరిత్ర సృష్టించిందన్నారు. జులై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో 1,00,473 కుటుంబాలకు ఈ కార్యక్రమం చేరువైందన్నారు. 68,918 అభ్యర్థనలకు 66,307 సర్టిఫికెట్లను అర్హులకు అందజేశామని చెప్పారు. జగనన్న సురక్ష ద్వారా 96 శాతం లబ్ధిదారులకు న్యాయం చేకూరిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు విజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ తెల్లం రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, తెల్లం చిన్నారావు, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ ఈ. తులసి, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

పథకాలతో ప్రతి ఇంటా సంతోషం



నులకానివారిగూడెంలో దివ్యాంగుడికి పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిస్తోన్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటిలో సంతోషం వ్యక్తమవుతోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. 181వ రోజు శుక్రవారం కామవరపుకోట మండలం రావికంపాడు గ్రామపంచాయతీ పరిధిలోని నులకానివారిగూడెం, వెంకటాపురం గ్రామాల్లో ఎలీజా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పథకాల అమలుపై ఆరా తీశారు. నులకానివారిగూడెంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. ప్రజలు పొందిన పథకాల లబ్ధి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ పేరుతో అర్హులు పథకాలు అందక, రాష్ట్రం అభివృద్ధికి నోచుకోక ప్రజలు అల్లాడిపోయారని గుర్తుచేశారు. నాలుగేళ్ల ముఖ్యమంత్రి జగన్ పాలనలో దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి గడపగడపకూ పథకాలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం సుభిక్షంగా ఉందని వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీకి ప్రతిపక్ష హోదాకు కూడా నోచుకోదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, షేక్ మేరా సాహెబ్, ప్రసాద్ రెడ్డి, నల్లూరు ప్రభాకర్ రావు, రాయంకుల సత్యనారాయణ, శ్రీను, మండల అధికారులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రేపు హమాలీల మహాసభ

జంగారెడ్డిగూడెం : ఈనెల 6న నిర్వహించే జంగారెడ్డిగూడెం డివిజన్ హమాలీల ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ పేర్కొన్నారు. మహాసభల ప్రచారంలో భాగంగా స్థానిక మసీద్ సెంటర్‌లో గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. మహాసభలకు ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, హమాలీల నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మయ్య, దూసరి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

6న ఆత్మజ్ఞానంపై శిక్షణ

జంగారెడ్డిగూడెం : ఈనెల 6న స్థానిక పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆత్మజ్ఞాన ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ట్రస్ట్ అధ్యక్షుడు కాకి రామకృష్ణ, కార్యదర్శి తటవర్తి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంకు చెందిన నక్షత్ర మిత్రలు హరికృష్ణ, పార్వతి దంపతులతో ఆదివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జంగారెడ్డిగూడెం : విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు తొలగింపు పనుల నిమిత్తం శనివారం పర్రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అయ్యప్ప టౌన్‌షిప్, మారుతీ నగర్, బాటగంగానమ్మ లేఅవుట్, పేరంపేట రోడ్, సాయిబాలాజీ టౌన్‌షిప్, సాయినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రైతులకు శాస్త్రవేత్తల సూచనలు



పుట్లగట్లగూడెంలో చేలను పరిశీలిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని పుట్లగట్లగూడెంలో వరద ముంపు పొలాలను శుక్రవారం ఏలూరు ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణికుమార్, మార్టేరు ప్రధాన శాస్త్రవేత్త ఎం.రామభద్రరావు, ఉండి కేవీకే శాస్త్రవేత్త రజిత పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ముంపు పొలాల్లో ఎకరానికి 20 కేజీల యూరియా, 15 కేజీల ఎంవోపీ వేయాలన్నారు. వరిలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగుల నివారణకు కార్టప్ హైడ్రో క్లోరైడ్ 4జి గుళికలు ఎకరానికి 6 కేజీలు వేయాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ పోశారావు అన్నారు.

'పొలంబడి'తో రైతులకు లబ్ధి

కొయ్యలగూడెం : పొలంబడి ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందని ఏఓ చెన్నకేశవులు అన్నారు. శుక్రవారం రాజవరం గ్రామంలో శాస్త్రవేత్తలతో కలిసి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణికుమార్ మాట్లాడుతూ రైతులకు ఆయిల్ పామ్ సాగులో వచ్చు తెల్ల దోమ నివారణ చర్యలను వివరించారు. మార్టేరు ప్రధాన శాస్త్రవేత్త ఎం.రామభద్రరాజు, కేవీకే ఉండి శాస్త్రవేత్త బి.రజిత, వ్యవసాయ విస్తీర్ణ అధికారి గణేష్ వర్మ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



ధర్మాజీగూడెంలో టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రావు

లింగపాలెం : తెల్ల పశువుల్లో వచ్చే ముద్ద చర్మ వ్యాధికి సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా పశువులను కాపాడుకోవచ్చని ఏలూరు పశువైద్యశాల ఉపసంచాలకులు కాటూరి చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం ధర్మాజీగూడెం వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 100 పశువులకు టీకాలు వేశారు. చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ తెల్ల పశువులకు పాక్స్ జాతికి చెందిన వైరస్ సోకడం వల్ల ముద్ద చర్మ వ్యాధి వస్తుందన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు సరఫరా చేస్తుందని తెలిపారు. నాలుగు నెలలు వయస్సు పైబడిన పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ధర్మాజీగూడెం పశువైద్యశాల సహాయ సంచాలకులు టి.రామకృష్ణప్రసాద్, ఎల్.రామకృష్ణ, వీఏఎస్ ఎం.మోహన్‌కుమార్, ఎల్ఎస్ఏ పి.గోపాలరావు, ఎస్.రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు



విజయలక్ష్మి గణపతి ఆలయంలో పూజ చేసిన భక్తులు

చింతలపూడి: స్థానిక మారుతీ నగర్‌లో రామాలయం ప్రాంగణంలో శ్రీ విజయశక్తి గణపతి ఆలయంలో శుక్రవారం సంకష్టహర చతుర్థి పూజలు చేశారు. ఆలయ నిర్మాణం అనంతరం తొలిసారిగా ఆలయంలో ఈ పూజలు చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చిల్లపల్లి రామమోహనరావు, కార్యదర్శి గోలి చంద్ర శేఖర రెడ్డి తెలిపారు. ఆలయంలో ప్రతి నెల సంకష్టహర చతుర్థి పూజలు, లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తామన్నారు. పాల్గొనాలనుకునే భక్తులు ఆలయ అర్చకులు లేదా అభివృద్ధి కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. ప్రధాన అర్చకులు వేమూరి వెంకట సుబ్బారావు, వేమూరి శ్రీహర్షలు పూజలు చేశారు. అభివృద్ధి కమిటీ గౌరవ సలహాదారు జల్లిపల్లి శివాజీ, డైరెక్టర్లు చిక్కాల సుధాకర్, అల్లంరాజు పవన్ కుమార్, గాంధీ, భాదరవాడ మోహన్‌రాజు, పెదకోటిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


'అనన్య' ఫస్ట్‌లుక్ విడుదల



అనన్య చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ బాబ్జి

జంగారెడ్డిగూడెం : నూతన నటీనటులతో తీసిన అనన్య చిత్రం ఘన విజయం సాధించాలని జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి ఆకాంక్షించారు. జంగారెడ్డిగూడెంలో అనన్య చిత్రం ఫస్ట్‌లుక్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. జంగారెడ్డిగూడెంతో పాటు ఏజెన్సీ పరిసర ప్రాంతాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలం అన్నారు. గతంలో చాలా సినిమాలు ఇక్కడ చిత్రీకరించారని గుర్తు చేశారు. అనన్య చిత్రం సైతం ఇక్కడ చిత్రీకరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంతం ఆర్టిస్టులతో ఇక్కడ సినిమా తీయడం విశేషమన్నారు. చిత్ర డైరెక్టర్ పి.ప్రసాదరాజు, నిర్మాత జంధ్యాల గంగాధర శర్మ మాట్లాడుతూ అనన్య చిత్రం హర్రర్ నేపథ్యంలో సాగే కుటుంబ కథా చిత్రం అన్నారు. అయినప్పటికీ యువతను ఆకట్టుకునేలా కథాంశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిత్రం హీరో, హీరోయిన్‌లు వెంకట్, చందన, విలన్ రాజేష్, పీఆర్ఓ కేఎస్ శంకరరావు, సహ నిర్మాత బుద్దాల సత్యనారాయణ, విద్యావికాస్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండపై నిరసన



రెడ్డికుంకాలలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

పోలవరం రూరల్: మణిపూర్ ఆదివాసీలపై మారణహోమాన్ని ఖండిస్తూ పోలవరం మండలం రెడ్డికుంకాల గ్రామంలో గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. పీవోడబ్ల్యూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం లత మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బుల్లిరెడ్డి, ప్రగతిశీల మహిళా స ంఘం నాయకులు సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బార్ సభ్యుల వినతి

జంగారెడ్డిగూడెం : మణిపూర్‌లో మారణహోమంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మణిపూర్ ఘటనను నిరసిస్తూ విధులను బహిష్కరించి ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యాలయ పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. బార్ ఉపాధ్యక్షుడు తల్లాడ అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏవీవీ భువనేశ్వరి, లైబ్రరి కార్యదర్శి విత్తనాల రత్నరాజు, మహిళా ప్రతినిధి బి.లతా కుమారి పాల్గొన్నారు.